# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 7, ఆగస్టు 2026


# విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. బీజేపీ ఆందోళన



## ❂ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**మంచిర్యాల, ఆగస్టు 6, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మంచిర్యాల పట్టణంలో వివిధ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల మిగతా 2లో..

### సింగరేణి చరిత్రలో నూతనాధ్యాయం

# ఎస్టీపీపీకి చేరుకున్న నైనీ బొగ్గు

- ఒడిశా నుంచి తెలంగాణకు చేరిన తొలి రైల్వే రేకు
- సింగరేణి విస్తరణకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం: భట్టి విక్రమార్క

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**



సింగరేణి చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది. ఒడిశా రాష్ట్రంలోని నైనీ గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే రేకు సుమారు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి (ఎస్టీపీపీ) గురువారం ఉదయం చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సంస్థ గని నుంచి తెలంగాణకు బొగ్గు సరఫరా కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. హిందోల్ రైల్వే సైడింగ్‌లో లోడ్ చేసిన 59 వేగన్ల ద్వారా సుమారు 4,000 టన్నుల జి-10 గ్రేడ్ బొగ్గు చేరింది. విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు వీడియో సందేశం ద్వారా కార్మికులకు, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని, సింగరేణి పటిష్టతకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. ఇటీవల తాడిచెర్ల-2, మణుగూరు డిప్‌సైడ్ బ్లాకులను సాధించామని, క్రిటికల్, రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలోనూ అడుగుపెట్టి సింగరేణిని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతామన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకున్న మిగతా 2లో..

### ఈవీఎంల గోదాం వద్ద భద్రతా ప్రమాణాలను

# కచ్చితంగా పాటించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త :**



ఈవీఎంల భద్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ హరిత అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను గురువారం సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, అగ్నిమాపక పరికరాలు, ద్వంద్వ తాళాల వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గోదాంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రవేశ-నిష్క్రమణ వివరాలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మల్‌లో సేంద్రీయ వ్యవసాయానికి పెద్దపీట

- ❁ మార్పిడి విధానాలపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- ❁ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**నిర్మల్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులతో కలిసి సేంద్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యానవన పంటల సాగు, ప్రోత్సాహకాలు, రైతుల సంక్షేమంపై ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో ఈ సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి సేంద్రీయ సాగు, పంట మార్పిడి విధానాలను విధిగా పాటించాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ ఉత్పత్తుల నాణ్యత పరీక్షలకు ప్రత్యేక విధివిధానాలు రూపొందిస్తున్నామని, మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉన్నందున మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. భూ సమస్యల మిగతా 2లో..



# నిర్మల్‌లో సేంద్రీయ వ్యవసాయానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతుల్లో అవగాహన పెంచాలని కమిషన్ సభ్యులు సూచించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో వరి, సోయా, కందుల స్థానంలో ఆయిల్ పామ్, ఉద్యానవన పంటల వైపు రైతులను మళ్లిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు, అందులో 8,300 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని వెల్లడించారు. రెవెన్యూ మ్యాప్‌లు లేని గ్రామాల్లో భూ సర్వే వేగవంతంగా జరుగుతోందని, భూ భారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కె.వి.ఎన్. రెడ్డి, భవానీ రెడ్డి, రామ్‌గోపాల్ రెడ్డి, సునీల్ కుమార్, గంగాధర్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డి.ఎఫ్.ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి చరిత్రలో నూతనాధ్యాయం

# ఎస్టీపీపీకి చేరుకున్న నైనీ బొగ్గు

(మొదటిపేజీ తరువాయి)

తొలి రైల్వే రేకుకు డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, ఎం. తిరుమలరావు ఘన స్వాగతం పలికి, అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుతం మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ యూనిట్ నిర్మాణంలో ఉందని వారు తెలిపారు. ప్రశాంతంగా సాగిన ఈ రవాణాకు సహకరించిన తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలు, రైల్వేలకు సీఎండీ బుద్ధప్రకాశ్ జ్యోతి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడి చిరంజీవి, జీఎం నరసింహ రావు, జీఎం సూర్యనారాయణ రాజు, గుర్తింపు కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రం, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా

## - హనుమాన్‌బస్తీ అంగన్‌వాడిలో తల్లిపాల వారోత్సవాలు

**బెల్లంపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్‌బస్తీ-1 అంగన్‌వాడి కేంద్రంలో గురువారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యతను సమాజానికి తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 31వ వార్డు కౌన్సిలర్ బండారి స్రవంతి ముఖ్య అతిథిగా పాల్గొనగా, లయన్స్ క్లబ్ సభ్యులు, అంగన్‌వాడి సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంగా బ్రెడ్, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కౌన్సిలర్ బండారి స్రవంతి, శిశువుల సమగ్ర ఆరోగ్యాభివృద్ధికి తల్లిపాలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన శిశువుకు జననం తర్వాత నుంచే తల్లిపాలు అందించడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి లభిస్తాయని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబం, సమాజం అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అంగన్‌వాడి సూపర్‌వైజర్ ప్రసన్న మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని తెలిపారు. తల్లిపాలలో ఉండే పోషకాలు శిశువుకు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయని, అందుకే తల్లిపాలనే శిశువుకు తొలి టీకాగా భావిస్తారని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి-బిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం మరింత బలపడటంతో పాటు తల్లుల ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం అవసరమని, ప్రతి తల్లి తల్లిపాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మంచి అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు స్వరూప, రాజేశ్వరి, పద్మావతి, విజయలక్ష్మి, కనకతార, భారతి, ఉమాదేవి, సుజాత, ఆయా సునీత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. బీజేపీ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండెతో పాటు ఏతం శివకృష్ణ, బొలిశెట్టి అశ్విన్, దుర్గం అశోక్, తుల ఆంజనేయులు, గాజుల ముఖేష్ గౌడ్, బోట్ల అనిత, కస్తూరి నాగరాజు, బేరా సత్యనారాయణ, పెద్దపల్లి పురుషోత్తం, జోగుల శ్రీదేవి, ఎనగందుల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

## - ప్రభుత్వ ఆస్తులకు హద్దులు నిర్ధారించి స్వాధీనం చేసుకోవాలి: కలెక్టర్ కె.హరిత

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. గురువారం కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ శివారులోని 79, 80 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములను కాగజ్‌నగర్ ఆర్డీవో చెన్నూరి కిష్టయ్య, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కాపువాడలో ఓ వ్యక్తి రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నట్లు, మరోచోట వెంచర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు ఏర్పాటు చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన హద్దులను పక్కాగా నిర్ధారించి, వాటిని స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సూచించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఆక్రమణలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధనతోపాటు రుచికరమైన భోజనం అందించాలి

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలం అనుకోడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంటగదిని గ్రామ సర్పంచ్ గుగులోతు విలాస్, జెడ్పీహెచ్ఎస్ ఆరెగూడ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పర్ష చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పోషకాహారం అందించేలా మెనూ ప్రకారం నాణ్యతతో వంటకాలు సిద్ధం చేయాలని సూచించారు.కొత్తగా ఏర్పాటు చేసిన వంటగది అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు భోజనం తయారీలో మరింత సౌకర్యం కలగనుందని వారు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గ్రామపంచాయతీ, పాఠశాల యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ బలరాం, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, పద్మ, గ్రామ పెద్దలు హరిలాల్, రామ్‌కుమార్, రవి, వేణు, శంకర్, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రత పునరుద్ధరించాలని కాగజ్‌నగర్‌లో మహాధర్నా

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని కాగజ్‌నగర్‌లో ఆర్ఎస్‌పీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన కృషిని స్మరించుకున్నారు. అనంతరం బహుజన ఆశాజ్యోతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రభుత్వం తగ్గించిన భద్రతను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ పట్టణంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.బహుజనుల హక్కులు, తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరంతరం పోరాడుతున్నారని నాయకులు అన్నారు. ఆయనకు భద్రత తగ్గించడం, తొలగించడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు. ప్రజా నాయకుడైన ప్రవీణ్‌కుమార్‌కు వెంటనే భద్రత పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. మహాధర్నాలో ఆర్ఎస్‌పీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, వైస్ చైర్మన్ ఎండి ఫారూక్ అహ్మద్, నాయకులు



**భైంసా, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

భైంసా పట్టణ కేంద్రంలోని రమేష్ మాశెట్టివార్ సుభాద్ర ఫ్యాక్టరీలో ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండి ఫారూక్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, విట్టల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, రమేష్ మాశెట్టివార్, సంజీవరెడ్డి, చోండి రాజేశ్వర్, ఏఎంసీ డైరెక్టర్లు భూమన్న, దేవిదాస్, కిష్టయ్య, రమేష్, మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామ్‌కుమార్, రాజేందర్, నవీన్ రెడ్డి, శ్రీను, అమరేందర్ రెడ్డి, ముత్యం, గణేష్, దిగంబర్ పటేల్, ప్రసాద్ పాటిల్, రాహుల్, నరేందర్ రెడ్డి, విశ్వనాథ్ పాటిల్ పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీటీసీలు మాణిక్‌రావు పటేల్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాహెబ్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు దీక్షిత్, కుంబి గ్రామ సర్పంచ్ విజయ్, మాజీ జడ్పీటీసీ సాహెబ్‌రావు పటేల్, ఖలీద్ ఖాన్, ఎస్డీ ఆలా, ఎస్డీ అన్వర్, ఎస్డీ సాబీర్, రసూల్ కురేషి, సాయినాథ్, అబ్బులల, మతీన్, మసూద్, అవినాష్, వాహిద్ ఖాన్, అబ్దుల్ హైమద్, పోశెట్టి, గఫూర్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ

**భైంసా, ఆగస్టు 06, ప్రభాతవార్త**

తానూర్ మండల కేంద్రంలో ముధోల్ మాజీ శాసనసభ్యులు విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. విట్టల్ రెడ్డి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ కేక్ కట్ చేసి, ఒకరికొకరు తీపి తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తానూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. విట్టల్ రెడ్డి పదవులకు అతీతంగా ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో విట్టల్ రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచి, అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నారాయణరావు పటేల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సాగర్ బాయి రాజన్న, మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, తానూర్ సర్పంచ్ జాదవ్ సుగంధ మాధవరావు పాటిల్, మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ గని, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మాజీ సర్పంచ్ సాయినాథ్ పాటిల్, లచ్చన్న, భీమ్ పవార్, సుభాష్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యాచకులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు..

**భైంసా, ఆగస్టు 05, ప్రభాతవార్త**

ముధోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డి విట్టల్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను భైంసా మండలంలోని దేగాం గ్రామంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విట్టల్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ నియోజకవర్గ ప్రజలకు మరిన్ని మేలైన సేవలు అందించాలని ఆకాంక్షి స్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాచకులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాయక్వాడ్ గంగాధర్, సున్నపు సాయిలు, మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, గడ్డిగారి చందు రెడ్డి, వార్డు సభ్యులు చోటు, రమేష్, కిష్టన్న, మోబిన్, లక్ష్మీకాంత్, సురేష్, భూమారెడ్డి, వీడీసీ చైర్మన్ నాని, లక్ష్మణ్, నరేందర్ రెడ్డిలతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## ఫీజు బకాయిలపై బీజేపీ పోరు

### నిర్మల్‌లో ఫీజు బకాయి బీజేపీ లడాయి - లక్ష సంతకాల సేకరణ

**నిర్మల్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్మల్ జిల్లాలో ఫీజు బకాయి బీజేపీ లడాయి – లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ యువమోర్చా నేతలు నిర్మల్ జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలలను సందర్శించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని కోరుతూ విద్యార్థుల నుంచి భారీగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫీజు బకాయిల కారణంగా వేలాది మంది పేద విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరజ్ నాయక్, సాత్విక్, బీజేవైఎం నాయకులు కందుల హరీష్, వెంకటేష్, భరత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీఓ

**సారంగాపూర్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 54 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయింది. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీఓ దేవిదాసు పరిశీలించారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, గ్రామ పాలనాధికారులతో కలిసి ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించారు. ముఖ్యంగా మరణించిన, వేరే ప్రాంతాలకు మారిన (షిఫ్టెడ్), డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దేవిదాసు మాట్లాడుతూ.. మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయడంలో కృషి చేసిన తహసీల్దార్, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, అధికారులను అభినందించారు. సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనలో భాగంగా బీరవెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి. విజయ్‌కాంత్‌రావు, నయాబ్ తహసీల్దార్ రాంచందర్, నిర్మల్ నియోజకవర్గ ఎన్నికల నయాబ్ తహసీల్దార్ గంగాధర్, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, గ్రామ పాలనాధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుంచి పూర్తిగా పేపర్‌లెస్ బిల్లులే

### - ఐఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్

### సమర్పణ తప్పనిసరి: డీటీఓ సరోజ

**నిర్మల్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కాగితరహిత పాలనలో భాగంగా నిర్మల్ జిల్లాలో ఐఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా బిల్లుల సమర్పణను పూర్తిగా డిజిటల్ విధానంలోకి మారుస్తున్నట్లు జిల్లా ఖజానా అధికారి (డీటీఓ) సరోజ ప్రకటించారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల బిల్లులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామని గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డీడీఓలు) ఇకపై బిల్లులను ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారానే సమర్పించాలని ఆదేశించారు. సహాయక పత్రాలను స్కాన్ చేసి జత చేయాలని, సమర్పించే ప్రతి పత్రాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 ప్రకారం చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకంతో ధృవీకరించాలని పేర్కొన్నారు. ఆగస్టు 15 తర్వాత ట్రెజరీ కార్యాలయాల్లో ఎలాంటి హార్డ్ కాపీ బిల్లులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఉప ఖజానా అధికారులు తమ పరిధిలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి ఈ ఆదేశాలను తెలియజేసి అమలు జరిగేలా చూడాలని సూచించారు. ఈ కొత్త విధానంతో జాప్యం తగ్గి పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.



# ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి

**నిర్మల్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. ఆజన్మాంతం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, ప్రజానీకానికి వివరించి స్వరాష్ట్ర ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని తెలిపారు. సబ్బండ వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. ఆచార్య జయశంకర్ కలలుగన్న బంగారు తెలంగాణను అధికారులు సమిష్టిగా అభివృద్ధి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో డీఆర్ఓ రాథోడ్ రమేష్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డిఈఓ భోజన్న, జిల్లా ఖజానా అధికారి సరోజ, ఎల్డీఎం రామ్‌గోపాల్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- నస్పూర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న**

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని నస్పూర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన చూపిన బాటలోనే ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జయశంకర్ ఆలోచనలు, సేవలు తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కే. సురేందర్ రెడ్డి, నాయకులు బండి రమేష్, రమేష్, అహ్మద్, పూధరి కుమార్, రుకుం తిరుమల్, పానుగంటి సత్తయ్య, ఆకునూరి సంపత్, భానుచందర్, రఫీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, అధికారులు



నివాళులర్పిస్తున్న బిసి సంఘం నాయకులు

**మంచిర్యాల, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు, త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజాసేవ, సామాజిక బాధ్యత పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాజ్ కుమార్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మంచిర్యాల, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ జాతిపిత, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఐబి మున్సిపల్ కార్యాలయ రహదారి కూడలిలో ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన సభలో బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన జయశంకర్ ఆశయాలను అమలు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. బీసీలు, బలహీన వర్గాలు, యువత, విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని, బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలను సంఘటితంగా ఎదుర్కొంటూ, సామాజిక న్యాయం సాధన కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకులు ఎదునూరి రమేష్, వీర్ల మదన్, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

**సారంగాపూర్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి జయశంకర్ సార్ బీజం వేశారని కొనియాడారు. యువకులు, విద్యావేత్తల్లో ఉద్యమ భావాలను నూరిపోసి, స్వరాష్ట్ర సాధన కోసం నిరంతరం శ్రమించారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న ఆర్థిక, విద్యా రంగాలోని దోపిడీని ఎండగడుతూ ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ బాసరలో..

**భైంసా, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

ఆర్జీయూకేటీ బాసర ట్రిబుల్ ఐటీ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విశ్వవిద్యాలయ యంత్రాంగం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజా ఉద్యమంగా మలచడానికి జయశంకర్ సార్ అందించిన దిశానిర్దేశం చిరస్మరణీయమని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాధాన్యతను, నాటి పాలకుల వివక్షను సమాజానికి స్పష్టంగా వివరించిన మహనీయుడని గుర్తుచేశారు. విద్యార్థులు కేవలం సాంకేతిక విజ్ఞానానికే పరిమితం కాకుండా ఆయన ఆదర్శాలను, క్రమశిక్షణను, సామాజిక బాధ్యతను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కే. రాములు నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. జయశంకర్ సార్ జీవితంలోని కీలక ఘట్టాలను, ఆయన పడిన శ్రమను డాక్టర్ రాములు సభకు వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు తెలంగాణ ప్రజా వాగ్గేయకారుల గీతాలను ఆలపించి సభను ఉత్తేజపరిచారు. ఈ వేడుకల్లో యూనివర్సిటీ అసోసియేట్ డీన్లు డాక్టర్ ఎస్. విటల్, శీలం శేఖర్, ప్రొఫెసర్ సాగర్, డాక్టర్ బి. విజయకుమార్, డాక్టర్ కె. మధుసూదన్, డాక్టర్ దేవరాజు, డాక్టర్ గుజ్జరి శంకర్, ఆర్. కుమార్, డాక్టర్ అజయ్ కుమార్, బద్రి, హరికృష్ణ, రాజు, దస్తగిరి, సతీశ్, శ్రీనివాస్, రజిత, రాయమల్లు, ముత్యం, కల్చరల్ కమిటీ సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జయశంకర్

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**

దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కల సాకారానికి కృషి చేసిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఆచార్య జయశంకర్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసమే జయశంకర్ తన జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. విద్య, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జయశంకర్ ఆచరణలో చూపించారని జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో గణాంకాలతో సహా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ ప్రజలను ఏకం చేసి రాష్ట్ర సాధనకు కృషి చేశారని చెప్పారు. జయశంకర్ ను స్మరించుకోవడాన్ని అదృష్టంగా భావిస్తూ, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జీఎం కార్యాలయ అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు జయశంకర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎంలు రాజన్న, ఆనంద్ కుమార్, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏరియా సర్వేయర్ నర్సింగ రావు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, డీవై పీఎంలు క్రాంతి కుమార్, కిరణ్, సీనియర్ పీఓ ప్రశాంత్, పిట్ సెక్రటరీ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



నివాళులర్పిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు



జయశంకర్ 92వ జయంతి వేడుకల్లో పాల్గొన్న జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు

# తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జయశంకర్ పాత్ర కీలకమైనది

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, జిల్లా అధికారులతో కలిసి హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆచార్య జయశంకర్ పోషించిన పాత్ర కీలకమైనదని, తెలంగాణ ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాలలో మార్పులు తీసుకువచ్చి అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేశారని, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రత్యేక పాత్ర పోషించారని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ తెలంగాణగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మహనీయుల ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా రావాలని తెలిపారు. అంతకుముందు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ముందు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. తద్వారా పర్యావరణంలో కాలుష్యాన్ని నియంత్రించవచ్చుని, భావితరాలకు స్వచ్ఛమైన, సహజమైన సమతుల్య వాతావరణాన్ని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చుని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కోటపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసి, స్వరాష్ట్ర ఆకాంక్షకు మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడు తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని రాంపూర్ గ్రామ సర్పంచ్ మానుమండ్ల రమేష్ అన్నారు. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రాంపూర్ గ్రామంలోని పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. జయశంకర్ సార్ ఆశయాలు, ఆలోచనలు నేటి విద్యార్థులకు, యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన కన్న కలలను నిజం చేస్తూ తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్. శిల్ప, పంచాయతీ అసిస్టెంట్ కె. వేణు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు రేణుక, సుకేశినిలతో పాటు పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కోటపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

తెలంగాణ ఉద్యమ పితామహుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్ జయంతి వేడుకలను కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సర్ చిత్రపటానికి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హరిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సర్ చేసిన త్యాగాలు, ఆయన అందించిన సిద్ధాంతాలు, భావజాలం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం చేసిన కృషిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,



విద్యార్థినులు పాల్గొని జయశంకర్ సర్ సేవలను స్మరించుకున్నారు.

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6, ప్రభాతవార్త :**

తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కల్పించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కే హరిత పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధి అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగలతో కలిసి హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలు పంచుకున్న మహనీయుడని, అయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. మహనీయుల ఆశయాల సాధనకు అందరం భాగస్వామ్యులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త :**

తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు సూ రం రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల.వైస్ ప్రెసిడెంట్ షేక్ మోమిన్ అలీ, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పుట్ట శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కటకాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా పలుచోట్ల ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ప్రజల్లో చైతన్యం కల్పించిన మహనీయుడిగా ఆచార్య జయశంకర్‌ను స్మరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి కృషి చేయాలని



**జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్**

పిలుపునిచ్చారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ప్రజాకవి గద్దర్ వర్ధంతి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గద్దర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ గద్దర్ తన పాటల ద్వారా సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాపర్తి మురళి, మీర్ కాసిమ్ ఇమ్రాన్, సుజియత్, రషీద్, కిషన్ గౌడు, గణపతి, మెంగజీ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదవేణి మల్లేష్, తారీక్, కట్కర్ భీమ్రావు, శోభన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు.



**నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



**నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు**



**నివాళులర్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు**



**నివాళులు అర్పిస్తున్న నాయకులు**





జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ వేణుగోపాల్

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కె. శ్రీదేవి, కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.కె. శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషి, పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. విద్యార్థులు జయశంకర్ సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవిత విశేషాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి గురించి తెలుసుకోవాలని సూచించారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజం, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీచింగ్ స్టాఫ్ డా. శారద, బి. వెంకటేశం, డా. దేవేందర్‌రెడ్డి, కృష్ణవేణి, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఛి. సత్యనారాయణ, రజిత, ముకుందరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్ సార్

**- బారెగూడ సర్పంచ్ కోట వేణుగోపాల్**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త**

తెలంగాణ భావజాలానికి ఆద్యుడు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని బారెగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల్లో ఆత్మగౌరవాన్ని నింపి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. నేటి యువత జయశంకర్ సార్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవతోపాటు సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యుడు చిప్పకుర్తి హరీష్, ఆశ కార్యకర్త సుమలత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, రియాజ్ అలీ, బాపూరావు, చంద్రమౌళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత నాయకులను విమర్శించడం సిగ్గు చేటు: బడికెల శ్రవణ్

**క్యాతన్ పల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

దళిత నాయకులను విమర్శించడం సిగ్గు చేటని బిఆర్ఎస్వీ జిల్లా మాజీ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బడికెల శ్రవణ్, కిరణ్ కుమార్‌లు అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ పట్టణంలోని బి.ఆర్.ఎస్ పార్టీ కార్యలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పైడిమల్ల నర్సింగ్ అనే వ్యక్తి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని, దళిత సమాజం సిగ్గు పడే విదంగా, డాక్టర్ రాజా రమేష్‌ను విమర్శించడం హాస్య స్పదమని అన్నారు. వైద్యునిగా ఉంటూ అటు వైద్య సేవ ఇటు ప్రజా సేవ చేస్తూ అందరి మన్ననలు పొంది సింగరేణిలో వైద్య వృత్తికి రాజీనామా చేసి ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో ముందుకు పోతున్నాడని, థో నెంబర్ దందా చేసుకుంటూ, భూమి పంచాయతీలు చేసుకుంటూ, అనేక మంది అమాయక ప్రజలను బెదిరించి భయబ్రాంతులకు గురిచేస్తూ, పోలీసు స్టేషన్‌కి వెళ్ళి సంతకాలు చేసే వ్యక్తి విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని అన్నారు. తెల్ల బట్టల వెనుక ఉన్న నేర చరిత్ర కల్గి ఉన్న నర్సింగ్ డాక్టర్ రాజా రమేష్ గురించి గాని, బాల్క సుమన్ గురించి గానీ మాట్లాడితే మర్యాద ఉండదని, ఘాటుగా హెచ్చరించారు. నర్సింగ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది బాల్క సుమన్ అని మర్చిపోవద్దని, దళిత నాయకుడి హోదాలో మాట్లాడి ఇంకో దళిత నాయకుడిని విమర్శించవద్దని హితవు పలికారు. కనీసం మర్యాద ఇవ్వకుండ మాట్లాడితే నీకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ లు, మాజీ కౌన్సిలర్ లు జిలకర మహేష్, జాడి మహేష్, కొండ కుమార్, శ్రీకాంత్, శివ, మణి, కంది క్రాంతి, సాయి దేవి, మణి కుమార్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి పోర్టల్‌పై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**



జిల్లాలో భూభారతి ఆపరేటర్లుగా ఎంపిక కాబడిన జూనియర్ సహాయకులు భూభారతి పోర్టల్ పై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి పోర్టల్ వినియోగం, విధివిధానాలపై జూనియర్ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి పోర్టల్ ద్వారా భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సేవల వేగం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. శిక్షణలో బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకుని, పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరిష్కరించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. భూభారతి పోర్టల్ నిర్వహణలో ఖచ్చితత్వం, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రెవెన్యూ సేవల అమలులో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భూభారతి పోర్టల్‌లో దరఖాస్తుల నమోదు, పరిశీలన, డిజిటల్ ప్రాసెసింగ్, భూ రికార్డుల నిర్వహణ, వివిధ సేవల అమలు, సాంకేతిక అంశాలు, సమస్యల పరిష్కార విధానాలపై మాస్టర్ ట్రైనర్లు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, రెవెన్యూ శాఖ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, వివిధ మండలాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో సంఘానికి ప్రాతినిధ్యం.. హైకోర్టు తీర్పుపై జర్నలిస్టుల హర్షం

**- ఉమ్మడి పోరాటానికి న్యాయం దక్కిందంటూ సంబరాలు**

**- ఆనందం వ్యక్తం చేసిన జిల్లా టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు**

**మంచిర్యాల, ఆగస్టు 6, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంపై మంచిర్యాల జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ నాయకులు ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుని హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమాన ప్రాతినిధ్యం కోసం సంఘం నిరంతరం చేసిన న్యాయపోరాటానికి హైకోర్టు తీర్పు న్యాయం చేకూర్చిందని వారు పేర్కొన్నారు. ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు సముచిత గుర్తింపు లభించడంతో పాటు అక్రెడిటేషన్ కమిటీలలో పారదర్శకత, సమాన అవకాశాలకు మార్గం సుగమమైందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, జిల్లా కార్యదర్శి సత్యగౌడ్, ఉపాధ్యక్షుడు కెమెరా వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు కోదూరి శ్రీనివాస్, శానగొండ శ్రీనాథ్, సతీష్ చారి, గొట్టె సురేందర్, దూడ సందీప్, చిలివేరు సుధీర్, అరిగెల ప్రవీణ్‌తో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.





# హై రిస్క్ గర్భిణుల సంరక్షణపై ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ

**- మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం.. తొలి విడతలో 75 మందికి అవగాహన**

**మంచిర్యాల, ఆగస్టు 6, ప్రభాతవార్త**

జిల్లాలో మాతా శిశు మరణాల నివారణతో పాటు సురక్షిత మాతృత్వాన్ని ప్రోత్సహించేందుకు హై రిస్క్ గర్భిణుల గుర్తింపు, సంరక్షణపై ఆరోగ్య కార్యకర్తలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం పునశ్చరణ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. తొలి విడతలో 75 మంది ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ అందించారు. చిన్న వయసులో లేదా 35 ఏళ్లకు పైబడిన గర్భధారణ, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, కవల గర్భం, గతంలో సిజేరియన్ ప్రసవం, మానసిక ఆరోగ్య సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, సికిల్ సెల్ వ్యాధి తదితర పరిస్థితులు హై రిస్క్ గర్భధారణలోకి వస్తాయని వివరించారు. ఇలాంటి గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచడం ద్వారా మాతా శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. గర్భిణుల నమోదు, కనీసం నాలుగు ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, ఆసుపత్రి ప్రసవం, అత్యవసర అంబులెన్స్ సేవల వినియోగం, ప్రసవానంతర సంరక్షణ, తల్లిపాలు, శిశువులకు టీకాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. శిక్షణను డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ పవన్ రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, పద్మ, కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్, ప్రవళిక, భాగ్య, ప్రశాంతి, విశ్వేశ్వర్ రెడ్డి, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో కుట్ర రాజకీయాలు చేసే వారికి కార్యకర్తలే బుద్ధి చెబుతారు

**ఆసిఫాబాద్ టౌన్, ఆగష్టు 6, ప్రభాతవార్త :**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొంతమంది నాయకులు వ్యక్తిగత స్వార్థం, పదవుల రాజకీయాల కోసం కావాలనే వర్గ విభేదాలను రెచ్చగొడుతూ పార్టీని బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి కొంతమంది కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి, అభివృద్ధి పనులు ఇప్పిస్తామంటూ హైదరాబాద్ గాంధీభవన్‌కు తీసుకెళ్లి తనపై ఆరోపణలు చేయించారని ఆమె ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమం కాదని, కొందరు నాయకులు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకమని విమర్శించారు. నన్ను నాన్‌లోకల్ అంటున్న వారు ముందుగా ఈ నేల చరిత్ర తెలుసుకోవాలని, నేను కొమురంభీమ్ గడ్డపై పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డ అన్నారు. ఈ నేలపై నాకు ఉన్న హక్కును ప్రశ్నించే నైతిక హక్కు ఎవరికీ లేదని, ఆదివాసి బిడ్డను నాన్‌లోకల్‌గా చిత్రీకరించడం జిల్లా ప్రజలను, ఆదివాసీ సమాజాన్ని అవమానించడమే అన్నారు. తాను 1995 ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీ గా గెలిచానని, అప్పటి నుంచి పార్టీ మారలేదని, ఉపాధ్యాయ వృత్తి చేసుకుంటున్న సమయంలో పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం తన పనితీరు, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానమే తనకు టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా, డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తుల పార్టీ కాదని, కార్యకర్తల పార్టీ అని, అందరికీ సమాన గౌరవం లభించేలా పనిచేస్తున్నానని తెలిపారు. పార్టీని బలోపేతం చేయకుండా, వ్యక్తిగత రాజకీయాల కోసం గాంధీభవన్‌ను వేదికగా మార్చిన వారు కార్యకర్తలకు సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుందని అన్నారు. ఇప్పటికైనా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పార్టీ జెండా కింద ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుగుణక్క పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, మీర్ కాసిమ్ ఇమ్రాన్, సుజియత్, రషీద్, కిషన్ గౌడు, గణపతి, మెంగజీ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదవేణి మల్లేష్, తారిక్, కట్కర్ భీమ్రావు, శోభన్, డిసిసి కార్యవర్గ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, అనుబంధ సంఘాల నాయకులు,సర్పంచులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ మండలాల నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



కంప్యూటరైజ్డ్ డేటాను పరిశీలిస్తున్న ఎస్పీ నితికా పంత్

## డీసీఆర్‌బీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**ఆసిఫాబాద్, ఆగష్టు 6, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ నితికా పంత్ గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నేరాల రికార్డులు, కేసుల డేటా నిర్వహణ, నేరస్థుల వివరాల నమోదు, పెండింగ్ రికార్డులు, కార్యాలయ రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణ, కంప్యూటరైజ్డ్ డేటా నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఖచ్చితత్వంతో నిర్వహించాలని, నేరాల గణాంకాలు, కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంలో డీసీఆర్‌బీ కీలక పాత్ర పోషిస్తుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డుల నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. అదేవిధంగా కార్యాలయంలో పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రవీందర్, సంపత్, ఎస్ఐ లావణ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు

**తాండూర్, ఆగష్టు 6, ప్రభాతవార్త :**

మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీ లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ మడావి ప్రభాత్ రావు, వార్డ్ మెంబర్లు బాదు, మల్లేశ్వరి, నరేష్, రజిత, అంగన్వాడి టీచర్లు జమున, లక్ష్మి ్మ, కరుణ, సీత, సువర్ణ, తిరుమల, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, గ్రామస్తులు భగవంతురావు, తదితరులు పాల్గొన్నారు.

## అడవి పంది దాడి బాధితురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహార చెక్కు అందజేత

**చింతలమానేపల్లి, ఆగష్టు 6, ప్రభాతవార్త**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కర్జెల్లి రేంజ్‌లో అడవి పంది దాడిలో మృతి చెందిన దుబ్బుల లక్ష్మమ్మ కుటుంబానికి అటవీ శాఖ తరఫున రూ.5 లక్షల పరిహార చెక్కును గురువారం అందజేశారు. మృతురాలి కుమారుడు దుబ్బుల నారాయణకు ఎమ్మెల్సీ దండే విఠల్, ఎఫ్‌డీఓ ఎ.అప్పయ్య, ఎఫ్ఆర్వో ఎ.సుభాష్‌లు సంయుక్తంగా ఈ చెక్కును అందజేసి అందించారు. బాధిత కుటుంబానికి రావాల్సిన మిగిలిన రూ.5 లక్షల పరిహారాన్ని కూడా త్వరలోనే మంజూరు చేయిస్తామని ఎఫ్‌డీఓ తెలిపారు.




## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైనవి

**లక్షెట్టిపేట, ఆగస్టు 06, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని వెంకటావుపేట గ్రామంలోని అంగన్వాడి సెంటర్ 1,2 నందు తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు అంగన్వాడి నిర్వాహకురాలు శారద తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నలిమెల రాజు అధ్యక్షత నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, డెలివరీ అయిన తర్వాత వచ్చే పాలు పసుపు రంగు ఉండటం వల్ల రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. కావున పిల్లలకు తప్పకుండా తాగించాలి. తల్లి, బిడ్డకు మొదటి 1000 రోజులు చాలా ముఖ్యమని తెలిపారు. గర్భిణీ అని తెలిసినప్పటి నుంచి పిల్లవాడు పుట్టిన రెండు సంవత్సరాల వరకు చాలా ముఖ్యమైన సమయమని అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు వార్డ్ మెంబర్ రాధిక, అంగన్వాడి టీచర్ శారద తదితరులు పాల్గొన్నారు.






చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న సర్పంచ్ కొప్పుల వెన్నెల, సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది

## తాండ్ర గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు

### - గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన

**సారంగాపూర్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

మండలంలోని తాండ్ర (జి) గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ భారతి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత, శిశు ఆరోగ్యం, గర్భిణుల పోషణపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ కొప్పుల వెన్నెల ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అన్నప్రాసన కార్యక్రమం ద్వారా చిన్నారులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవడుతాయని, పిల్లల శారీరక, మానసిక వికాసానికి పోషకాహారం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వనజ, సరిత, గోదావరి, ఆశా కార్యకర్త గంగమణి, డ్వాక్రా వెలుగు సీఏ సుజాత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

**బజార్‌హత్నూర్, ఆగస్టు 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని 2వ అంగన్వాడీ కేంద్రంలో గత 25 ఏళ్లుగా ఆయాగా విధులు నిర్వహించిన బొట్టు గంగుబాయి అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ గురువారం గంగుబాయి స్వగ్రామమైన బజార్‌హత్నూర్‌కు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగుబాయి మరణం పట్ల వారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె కుమారుడు, కుమార్తెలకు మనోధైర్యం కల్పిస్తూ, అధైర్యపడవద్దని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా, మండల నాయకులు కీర్తి రమణ, రాజు, హేమలత, సురేఖ, సావిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.



# కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ - ఆగస్టు 14 వరకు నియోజకవర్గంలో సిపిఐ ప్రజా పోరు యాత్ర**

**నస్పూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త**

కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంచిర్యాల నియోజకవర్గ స్థాయిలో ఆగస్టు 6 నుండి 14 వరకు చేపట్టే ప్రజా పోరు యాత్రను శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం నియోజకవర్గ పరిధిలోని అన్ని వాడల్లో ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని శంకర్ విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కులం, మతం పేరిట విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు గురికావడం ప్రభుత్వ హత్యేనని పేర్కొన్నారు. దీనిపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 22 రోజుల పాటు నిరసన తెలిపిన విద్యార్థులు, యువకులపై కేసులు పెట్టి నిర్బంధానికి గురిచేయడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని శంకర్ డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని, కార్మికుల, దళిత, ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని కోరారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. మోదీ ప్రభుత్వ వికృత చేష్టలను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, రేగుంట చంద్రకళ, జిల్లా సమితి సభ్యులు మిర్యాల రాజేశ్వర రావు, కొట్టే కిషన్ రావు, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, ఇలవేణి సారంగపాణి, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మణ్, దేవి పోచన్న తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సిపిఐ ప్రజా పోరు యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలవేన శంకర్



## ఎల్లారం ప్రాథమిక పాఠశాలలో ప్లేట్ల పంపిణీ

**లక్షెట్టిపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని ఎల్లారం ప్రాథమిక పాఠశాలలో హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు, రెండు ఫ్యాన్లు, ఒక ర్యాక్, కూల్ క్యాన్‌ను గ్రామ సర్పంచ్ గొడిశల రాజేశం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పిల్లలకు ఈ విధంగా సహాయం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాగే ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో కొంతైనా విద్య కోసం వెచ్చించాలని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మంచి పేరు, ఉద్యోగం సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు ఉమ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జ్యోతి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్త మమత, చంద్రమోళి, తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.



## ఆగస్టు 10న జైల్ భరోను జయప్రదం చేయాలి

**- హమాలీలకు సమగ్ర చట్టం తేవాలి**

**- రైస్‌మిల్ హమాలీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు గోమాస ప్రకాష్**

**లక్షెట్టిపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని ముత్యంపేట, మిట్టపల్లి రైస్ మిల్లుల హమాలీల వద్ద ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్ హమాలీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ... హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా రూ.25 లక్షలు చెల్లించాలని, నెలకు రూ.9,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్లపై దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఆగస్టు 10న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే జైల్ భర్తో కార్యక్రమంలో జిల్లాలోని హమాలీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.కొమురయ్య, గంగన్న, చందు, శ్రీనివాస్, పోలింగ్, తిరుపతి, లచ్చయ్య, సురేష్, శేఖర్, బాణేష్, రాములు, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

## తోడే వంశీకృష్ణ రెడ్డి జయంతి సందర్భంగా అన్నదానం

**బెల్లంపల్లి, ఆగస్టు 06, ప్రభాతవార్త**

తోడే వంశీకృష్ణ రెడ్డి జయంతి సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి అన్న తోడే వెంకట కృష్ణారెడ్డి సహకారంతో పట్టణంలోని కాంటా చౌరస్తా సమీపంలోని పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిక్షాటకులు, కార్మికులు, అలాగే వివిధ గ్రామాల నుండి పట్టణానికి వచ్చిన ప్రజలకు సుమారు 150 మందికి పైగా ఉచితంగా భోజనం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వంశీకృష్ణ రెడ్డి సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ నిర్వాహకుల సేవా దృక్పథాన్ని అభినందించారు. ముఖ్యంగా అవసరమైన వారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావా స్వాతిరమేష్ బాబు, 2వ వార్డు కౌన్సిలర్ నిచ్చకొల వంశీ, 34వ వార్డు కౌన్సిలర్ రామ్ మూర్తి, పీక లక్ష్మణ్, కంకటి శ్రీనివాస్, నీలి కృష్ణ, లెంకల సన్నీ యాదవ్, పసులేటి వెంకటేష్, లక్కాకుల సన్నీ, మదర్ బోయిన వేణుగోపాల్, ఎర్ర రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

**తాండూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తుడుం దెబ్బ నాయకులు కోరారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను గురువారం నాయకులు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయం ప్రతిపత్తి, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే రోజుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది తెగల ఆదివాసీలందరూ కుల, ప్రాంత, రాజకీయ భేదాలకు అతీతంగా ఒక్కటై ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, గూడెంలో ఆదివాసీ జెండాలు ఎగురవేసి, మండల కేంద్రంలో ర్యాలీలు తీసి కిష్టంపేట్ లోని కుమరంభీం విగ్రహం వద్ద జెండా వేయడం జరుగుతుందన్నారు.ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, జల-జంగల్-జమీన్‌పై హక్కులు, సంస్కృతి, భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసీ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలకు ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సెంగ బాబురావు, కార్యదర్శి ఎలిగేటి రమేష్, మండల గౌరవ అధ్యక్షులు అల్లంకొండ భీమయ్య, అధ్యక్షులు యాపల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి బుర్ష ప్రవీణ్, ఉపాధ్యక్షులు గావుడే మల్లేష్, సర్పంచులు పోతరాజుల రాంబాబు, ప్రభాత్ రావు, మాజీ సర్పంచ్ చింతపూరి దుర్గాబాయి, టేకం రాజేష్, ఊరేడి వెంకటేష్, రెబ్బెన అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసి దినోత్సవ కరపత్రాలు విడుదల చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

## ప్రజల ఆరోగ్యమే గ్రామాభివృద్ధికి పునాది

**- సర్పంచ్ కోట వేణుగోపాల్**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

బారెగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలు చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధి చెందిన గ్రామానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బందిని అభినందించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యుడు హరీష్, సిబ్బంది పార్వతి, ప్రణవి, లక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

